# ఊటీలో ఓ సాయంత్రం

5799



'నవ్య' వారపత్రిక . . . 30 మార్చి, 2005

"నందూ..! మనం పెళ్ళి చేసుకుందాం!" చందూ అడిగాడు.

నవ్వింది నందిని.

"మాట్లాడవేం నందూ? నిన్ను పెళ్ళిచేసుకోవడానికి నేను అర్హుణ్ణి కానా..?"

"నీకేం తక్కువ చందూ? ఎటొచ్చీ నాకే ఆ అర్హత లేదు."

"ఎందుకు లేదు?"

"చెబితే నువ్వు తట్టుకోలేవు."

"తట్టుకుంటానులే... చెప్పు!"

నందిని మట్లాడలేదు.

"నందూ... ప్లీజ్- ఈ సస్పెన్స్ నేను భరించలేను. త్వరగా చెప్పు!" అసహనంగా అన్నాడు చందూ.

చెప్పింది నందిని.

●

ఆఫీసు వాళ్ళిచ్చే 'లీవ్ ట్రావెల్ కన్సెషన్' సదుపాయాన్ని ఉపయోగించుకుని ఊటీ వచ్చాడు చందు.

నిజానికి అతనికి ఒంటరిగా ప్రయాణాలు చేయడం, ఊర్లు చూడటం అంటే విసుగు. అయితే ఉన్న సదుపాయాన్ని వ్యర్థంచేసుకోవడం ఎందుకని, ఏదో ఒక ఊరు చూసిరమ్మని సహోద్యోగులు నచ్చచెప్పి పంపితే ఊటీ వచ్చాడు. పైగా- ఆ నెలాఖరులోగా ఆ సదుపాయాన్ని వాడుకోకపోతే ఆ బ్లాకు వ్యర్థమవుతుంది.

ఒంటరిగానే ఊటీ మొత్తం తిరిగాడు. అతనికి ఊటీ అందంగా కనిపించలేదు. 'తనకో ప్రేయసి ఉండి, ఆమెతో కలిసివచ్చి వుంటే ఊటీ అందాల్ని ఎంజాయ్ చేసివుండవచ్చు. కనీసం ఓ స్నేహితుడన్నా తనవెంట ఉండిఉంటే తమకు కలిగిన భావాలను, ఆలోచనలను పంచుకుని ఉండేవాళ్ళు. ఇలా ఒంటరిగా తిరుగుతూంటే ఊటీకంటే తిరుపతే ఎంతో అందంగా వుంది' అనుకున్నాడు.

అలా ఆలోచిస్తూ, నడుస్తూ బోట్‌క్లబ్ చేరాడు. అంతగా జనం లేరు అక్కడ. ఒకే ఒక బోటు ఒడ్డున ఉంది. అందులో ఓ అందమైన యువతి కూర్చొనివుంది. పాతిక, ముప్ఫై మధ్య ఉండొచ్చు ఆమె వయసు. చిలకపచ్చ రంగు చీర, అదే రంగు రవిక ధరించి వుంది. ట్రాన్స్‌పరెంట్ చీరలోంచి ఆమె అందాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. క్లిప్పు వేసి వదిలేసిన కురులు గాలికి ఎగుర్తుంటే చూడటానికి ఎంతో ఆహ్లాదంగా అనిపించింది అతనికి.

బోటు నడిపే అతను చందూని చూడగానే "మీరూ వస్తారా..?" అని తమిళంలో అడిగాడు.

"ఆవిడ ఉన్నారుగా..!" అన్నాడు చందూ తమిళంలో- కళ్ళతోనే ఆమెవైపు చూపిస్తూ.

"ఫర్వాలేదు. కౌంటరులో టిక్కెట్టు తీసుకునిరండి... బయల్దేరుదాం!" అన్నాడు బోటు నడిపే అతను. చందూ టిక్కెట్టు కొని, బోటులోకి అడుగుపెట్టి ఆమె ఎదురుగా కూర్చున్నాడు.

బోటు కదిలింది.

చందూ నీళ్లను, దూరంగా వెళ్తున్న పడవల్ని, ఆకాశాన్ని చూస్తూ అప్పుడప్పుడూ ఆమెవైపు చూడసాగాడు. అతను అలా చూసినప్పుడల్లా ఆమె తననే చూస్తూండటం గమనించాడు.

పడవ కొంతదూరం ప్రయాణించి మళ్లీ ఒడ్డుకు రాసాగింది. ఆమెతో పడవ ప్రయాణం అంత తొందరగా ముగియడం అతనికి బాధగా అనిపించింది. ఆమె ఒప్పుకుంటే ఇంకో రౌండు వెళ్లిరావాలనివుంది అతనికి. ఆమెవైపు చూశాడు. ఆమె ముఖంలో చిరునవ్వు కన్పించింది. చందూకి కాస్త ధైర్యం వచ్చి, "షల్ వుయ్ గో ఫర్ అనదర్ రౌండ్?" అని అడిగాడు ఆమెని.

ఆమె తల ఊపింది. చందూ పడవతనితో తమిళంలో చెప్పాడు. అయితే... అతను అలా వీలుకాదని, ఒడ్డుకు వెళ్లాక మళ్లీ టికెట్ కొనాలని, అక్కడ వీళ్ళకంటే ముందుగా టిక్కెట్ కొన్నవాళ్ళు ఎవరైనా వుంటే వాళ్ళకు ముందు ప్రిఫరెన్స్ ఇవ్వాలని అన్నాడు.

చందూకి అతను చెప్పింది నచ్చలేదు. ఆమెవైపు ఏమంటారన్నట్టు చూశాడు. "వుయ్ విల్ గెట్‌డౌన్!" అంది.

బోటు దిగాక ఆమె పడవతనికి పదిరూపాయల నోటు పర్సులోంచి తీసిచ్చింది. చందూ కూడా పర్సు తీయబోతుంటే ఆమె వారించి, తామిద్దరిదీ కలిపే ఇచ్చానని చెప్పింది.

"థాంక్యూ!" అంటూ పర్సు జేబులో పెట్టుకున్నాడు.

ఇంతలో... ఆమె చేతిలోని సెల్ మోగింది. ఆమె సెల్ ఆన్ చేసి, "హలో..." అంది. అటుపక్క మాటలు విన్నాక "నేను ఇప్పుడు బోటుక్లబ్ దగ్గర ఉన్నాను. సరే... అలాగే... ఏదో ఒక హోటల్లో సప్పర్ ముగించి గదికి వస్తాను... బై!" అని సెల్ ఆఫ్ చేసింది.

"మీరు తెలుగువారా..?" ఆశ్చర్యం, ఆనందం మిళితమైన స్వరంతో అన్నాడు.

"అవును. అరెఁ... మీరు కూడా తెలుగువారేనా?" అంది- ఆమె కూడా ఆశ్చర్యపోతూ.

"అవును... మాది తిరుపతి!"

"మాది గుంటూరు!" అందామె.

"రండి... అలా కూర్చుందాం!" అంటూ ముందుకు దారితీశాడు చందూ. ఆమె అతన్ని అనుసరించింది.

బోట్‌క్లబ్ ప్రక్కనే ఉన్న ఓ రెస్టారెంటు బయట కుర్చీలో కూర్చున్నారు.

"కూల్‌డ్రింక్ తాగుదామా?" చందూ అడిగాడు.

"ఊటీలో అన్నీ వేడిగా ఉన్నవే తాగాలి. ఐ ప్రిఫర్ కాఫీ..!" అంది.

చందూ కాఫీలకు ఆర్డరిచ్చాడు. ఆమె తననే తదేకంగా చూస్తూండటం చందూ గమనించాడు. కాసింత గర్వం కలిగింది అతనికి. ఆఫీసులో అందగాడని పేరుంది అతనికి. అతని అందానికి తగ్గ జోడీ కోసం వెతికి వెతికి అలసిపోయాడు. ఇప్పుడతని వయసు ముప్పై దాటింది. 'ఇక ఆలస్యం చేయకూడదు. ఎక్కడో ఒకచోట కాంప్రమైజ్ అయిపోయి పెళ్ళిచేసుకోవాలి!' అనుకుంటున్న సమయంలో ఆమె పరిచయం కావడం తన అదృష్టంగా భావించాడు చందూ.

"నా పేరు చందూ... మీ పేరు?"

"నందిని!"

కొంతసేపు తన ముందున్న గ్లాసు వైపే చూస్తూండిపోయాడు. తర్వాత... "మీరు ఊటీకి మీ ఫ్యామిలీతో వచ్చారా?" అని అడిగాడు.

"ఆఁ... అవును!" అంది ఉలిక్కిపడి.

"ఏ లోకంలో ఉన్నారు?" అన్నాడు నవ్వుతూ.

"మీ లోకంలో!"

ఆమె అతన్నే సూటిగా చూస్తోంది. 'ఈమె కళ్ళలో ఏదో శక్తి దాగివుంది. ఏమంటారు దాన్ని? వశీకరణ శక్తి అంటారా..? ఇంతదాకా ఏ ఆడపిల్ల వైపు ఆకర్షితుడు కాని తను- ఇంతగా ఈమె పట్ల ఆకర్షితుడవుతున్నాడు. దీనికి కారణం ఆమె అందమా? నాజూకుతనమా? అవయవ సౌష్టవమా? ఏది కారణం?' అని ప్రశ్నించుకున్నాడు.

కాఫీ తెచ్చాడు సర్వర్. ఇద్దరూ మౌనంగా ఒకరినొకరు చూసుకుంటూ కాఫీ తాగారు. బిల్లు చందూ చెల్లించాడు.

ఆ తర్వాత ఇద్దరూ మాట్లాడుకుంటూ నడవసాగారు. మాటల్లో పడి ఎక్కడికెళ్తున్నారో, ఎంతదూరం వెళ్తున్నారో కూడా చూసుకోలేదు వాళ్ళు. తిరిగిన వీధుల్లోనే మళ్లీ మళ్లీ తిరిగారు. ఎక్కువగా చందూనే మాట్లాడాడు. ఆమె ఆసక్తిగా వింటూ 'ఊఁ' కొట్టడం, తల ఊపడం చేసింది. అలా చాలాసేపు నడిచాక ఆమె అలసిపోయింది.

"ఇక నేను గదికి వెళ్లాలి... ఆటో కనిపిస్తే ఆపండి!" అంది.

చందూ ఆటో మాట్లాడి, "పదండి... మీ హోటల్ వరకు నేనూ వస్తాను. కొత్త స్థలంలో ఒంటరిగా వెళ్లడం మంచిది కాదు" అంటూ ఆమె పక్కన కూర్చున్నాడు.

ఆమె కూర్చున్నచోటు నుంచి కొంతకూడా జరగకపోవడం అతను గమనించాడు. ఆ ఇరుకు ఇబ్బందిగా అనిపించలేదు అతనికి. ఆమెపై మరింత ఇష్టం పెంచింది.

హోటలు ముందు ఆటో ఆగింది. చందూ డబ్బులిచ్చి ఆటో అతన్ని పంపేశాడు.

"నేను వెళ్తాను..." అంది నందిని.

"భోజనం చేసి గదికి వస్తానని ఫోనులో ఎవరితోనో చెప్పారు?"

"భోజనం చెయ్యాలని లేదు. టిఫిన్ గదికి తెప్పించుకుని తింటాను."

"మళ్లీ ఎప్పుడు కలుద్దాం?" కుతూహలంగా అడిగాడు.

"రేపు ఉదయం..!"

"మీవాళ్ళతో సైట్ సీయింగ్‌కి వెళ్లరా?"

"లోకల్‌గా అన్నీ చూసేశాం. ఇక తిరిగే ఓపిక లేదు నాకు!" అంది నందిని.

"అయితే రేపు టాక్సీ మాట్లాడుకుని 'కూనూర్' దాకా వెళ్లొద్దాం. ఆ రూట్‌లో ప్రకృతి దృశ్యాలు చాలా అద్భుతంగా ఉంటాయిట!" అన్నాడు చందూ.

"మంచి ఆలోచన! అయితే రేపు ఉదయం తొమ్మిది గంటలకు బోట్‌క్లబ్ దగ్గర మీకోసం ఎదురుచూస్తూంటాను."

"బోట్‌క్లబ్ దగ్గర ఎందుకు? ఇక్కడే కలుద్దాం!"

"మిమ్మల్ని నాకు పరిచయం చేసిన బోట్‌క్లబ్ అంటే నాకెంతో ఇష్టం. అందువల్ల అక్కడే కలుద్దాం!"

"అలాగయితే సరే..!" అన్నాడు చందూ సంతోషంగా.

●

మరుసటి రోజు ఉదయం బోట్‌క్లబ్‌కి వెళ్లిన చందూకి అక్కడ నందిని ఓ అందమైన యువకుడితో మాట్లాడుతూ కనిపించింది.

ఒక్కక్షణం 'ముందుకు వెళదామా, వెనక్కి వెళ్లిపోదామా..?' అని ఆలోచిస్తున్న అతన్ని చూసి నందిని చెయ్యి ఊపింది. మరో ఆలోచన లేకుండా ముందుకే అడుగులు వేశాడు.

"గుడ్‌మార్నింగ్ చందూగారూ..!" నవ్వుతూ విష్ చేసింది నందిని.

"గుడ్‌మార్నింగ్!"

"చందూగారూ! వీడు మా కజిన్... పేరు కమలాకర్! మేమంతా ముద్దుగా 'కమల్' అని పిలుస్తాము" అంటూ తన పక్కనున్న వ్యక్తిని పరిచయం చేసింది.

"హలో..." అంటూ అతనికి చేయి అందించాడు చందూ. అతను ఆమె 'కజిన్' అని తెలిశాక చందూ మనసు తేలికయింది.

"మీరు కూనూర్ వెళ్లాలని నందు చెప్పింది. నాకు తెలిసిన టాక్సీ అతను ఉన్నాడు. మీకు అభ్యంతరం లేకపోతే అతన్ని అరేంజ్ చేస్తాను" అన్నాడు కమల్.

"నాకేం అభ్యంతరం లేదు..." అన్నాడు చందూ.

కమల్ నందిని దగ్గరున్న సెల్ తీసుకుని కాస్త దూరంగా వెళ్లాడు.

"రాత్రి బాగా నిద్రపోయారా..?" నందిని చందూని అడిగింది.

నిద్రపోలేదన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

"ఎందుకని?"

"ఏవో ఆలోచనలు!"

"బ్రహ్మచారికి ఆలోచనలు ఏముంటాయి..?" అంది నవ్వుతూ.

"బ్రహ్మచారికి ఉండే ఆలోచనలే ఉంటాయి!" అన్నాడు తనూ నవ్వుతూ.

కమల్ తమ వద్దకు వస్తూండటం చూసి మాటలు ఆపారు.

పది నిముషాల్లో కారు వచ్చింది.

"ఎంతకు మాట్లాడారు..?" చందూ కమల్‌ని అడిగాడు.

"అవన్నీ నేను చూసుకుంటాను... మీరు హ్యాపీగా వెళ్లిరండి!"

"ఫర్వాలేదు... చెప్పండి!"

కమల్ చెప్పి, "ఆ మొత్తం డ్రైవర్‌కే ఇచ్చేయండి. ఐ విష్ యూ ఎ హ్యాపీ టైమ్!" అన్నాడు.

"థాంక్యూ..." అంటూ కారులో కూర్చోబోతూ– "మీరూ రాకూడదా మాతో పాటు!" అని మొహమాటానికి పిలిచాడు చందూ.

"సారీ... నాకు వేరే పనుంది, మీరు వెళ్లిరండి!"

ఈసారి అతనికి మనసులోనే 'థాంక్స్' చెప్పుకున్నాడు చందూ.

ప్రయాణంలో నందిని తనను తాకుతూ కూర్చోవడం, అడపాదడపా తన చేతులు పట్టుకోవడం... స్త్రీస్పర్శ ఎరుగని అతనికి ఎంతో ఉత్తేజాన్ని కలిగించింది. ఆమె కట్టుకున్న షిఫాన్ చీర చాలాసార్లు జారిపోవడం చూసిన అతను– ఆమెనేమీ చేయకుండా ఉండటానికి చాలా కష్టపడ్డాడు.

కూనూర్‌లో లంచ్ చేసుకుని సాయంత్రం తిరిగి ఊటీ చేరారు ఇద్దరూ.

ఆరాత్రి చందూ తన బాస్‌కి ఫోన్ చేసి, తను లీవు మరో వారంరోజులు పొడిగిస్తున్నట్టు చెప్పాడు.

●

చందూ హోటల్ గదిలో కూర్చొనివున్నాడు.

నందిని చెప్పిన విషయం అతను జీర్ణం చేసుకోలేకపోతున్నాడు.

ఈ వారంరోజుల్లో నందినిని చాలాసార్లు కలిశాడు చందూ. ఇద్దరూ కలిసి తిరిగారు, కలిసి తిన్నారు. చందూకు రాత్రుల్లో నిద్రవచ్చేది కాదు. కనులు తెరిచినా, కనులు మూసినా ఆమె రూపమే కనబడేది.

ఆమె లేకుండా తను జీవించలేనని తెలిసింది అతనికి. ఆమెను పెళ్ళి చేసుకోవడానికి నిర్ణయించుకున్నాడు.

బోట్‌క్లబ్ దగ్గర ఆమెను కలిశాడు. పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు.

ఆమె చెప్పింది విని షాక్ తిన్నాడు.

"నాకు పెళ్ళైంది... నేను ఊటీకి మావారితోనే వచ్చాను..."

"నేను నమ్మను!" అన్నాడు చందూ.

ఆమె పైట చాటునున్న బంగారుచైను బయటకు తీసి, దాని చివరనవున్న మంగళసూత్రాలు చూపించింది.

"మెట్టెలు..?"

"నేను వేసుకోను."

గిరుక్కున వెనక్కి తిరిగి నడవసాగాడు.

"చందూ! నా మాట విను... ప్లీజ్! ఒక్కనిముషం ఆగు..." నందిని పిలుస్తున్నా వినకుండా వచ్చేశాడు.

గదిలో కూర్చొని ఆలోచిస్తున్నకొద్దీ అతని తల వేడెక్కసాగింది. 'ఎంతగా మోసపోయాడు తను..? ఆమె పరిచయమైన రోజే ఆమె కాళ్లకు మెట్టెలు లేకపోవడం గమనించాడు తను. ఆమెకు పెళ్ళి కాలేదనుకుని పిచ్చిగా ఆమె ప్రేమలో కూరుకుపోయాడు. మరి, ఆమె ఎందుకు తనతో అంత చనువుగా తిరిగింది? ఏముంది ఆమె మనసులో?'

అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ కాలింగ్‌బెల్ మ్రోగింది.

తలుపు తెరిచి ఆశ్చర్యపోయాడు. ఎదురుగా నందిని నిలబడివుంది.

మళ్లీ ఆశ మొదలైంది అతనిలో. 'తనకింకా పెళ్ళి కాలేదని, అతన్ని ఏడిపించడానికే అలా చెప్పానని' ఆమె చెబుతుందని ఆశించాడు.

ఆమె మౌనంగా తలుపు మూసింది.

"ఎందుకు వచ్చావు మళ్లీ?" కోపంగా అడిగాడు చందూ.

"నిన్ను వదిలి బ్రతకలేను చందూ!"

"నీకు పెళ్ళైందన్న విషయం నువ్వు మరిచిపోయినా నేను మరిచిపోలేదు. అసలు నన్నెందుకింత మోసం చేశావు?" బాధగా అడిగాడు.

"చందూ... అది మోసం కాదు- ప్రేమ! నీకు జరిగినదంతా చెబుతాను విను. నేను డిగ్రీ చదువుతున్నప్పుడు వ్యాపారం పనిమీద 'మురుగవేల్' గుంటూరు వచ్చారు. ఆయన మా నాన్న తరపు దూరపు బంధువు కావడంతో మా యింట్లోనే దిగారు. అప్పటికి ఆయనకు మొదటిభార్య పోయి రెండేళ్లయింది. పిల్లలు లేరు. నన్ను చూసి తనతో నా పెళ్ళికి ప్రపోజల్ మానాన్న ముందు పెట్టారు. ఒకపూట తింటే మరోపూట పస్తు పడుకునే పరిస్థితిలో మేమున్నపుడు- ఓ కోటీశ్వరుడు అల్లుడుగా వస్తానంటే మా నాన్న కాదనలేకపోయాడు. నాకు ఇష్టంలేకున్నా ఆయన భార్యనయ్యాను. మా ఇద్దరికీ వయసులో ఇరవయ్యేళ్ల తేడా వుంది. నాలోని ఆశల్నీ, కోరికల్నీ చంపుకుని, మనసుకి సర్దిచెప్పుకుని, ఆయనతో కాపురానికెళ్లాను.

కాని, ఆయన తన అర్ధాంగిగా నన్ను ఏనాడూ చూడలేదు... ఎప్పుడూ బిజినెస్ పనులే, వాటికి సంబంధించిన ఆలోచనలే! ఇంట్లో ఆయనకు అన్నీ చేసిపెట్టడానికి ఓ పనిమనిషిగా, వంటమనిషిగా నన్ను తెచ్చుకున్నాడని నాకర్థమైంది. శృంగారం పట్ల కూడా ఆయనకు ఆసక్తి లేదు.

రోజులు యాంత్రికంగా గడుస్తున్న సమయంలో నువ్వు నాకు కనిపించావు. మొదటి చూపులోనే నాకెంతో నచ్చావు. నేను కలలుగన్న రాకుమారుడు నువ్వే అనిపించింది. నాకు పెళ్ళయిందని చెబితే నువ్వు దగ్గర కావని చెప్పలేదు. ఆ తర్వాత నాకు దూరమవుతావని చెప్పలేదు. కాని, ఏదో ఒకరోజు చెప్పక తప్పదని తెలుసు. అందుకే ఈరోజు చెప్పి నా మనసులోని భారం దించుకున్నాను. నేను పుట్టాక ఆనందంగా గడిపింది నీ సాహచర్యంలోనే చందూ! ఐ లవ్ యూ చందూ... ఐ లవ్ యూ!" అంటూ అతన్ని కౌగిలించుకుని ఏడవసాగింది.

చందూ అనునయంగా ఆమె చుట్టూ చేతులు వేసి, దగ్గరగా తీసుకున్నాడు. తర్వాత తన కౌగిలిలో బంధించాడు. ఆమెను ముద్దుల్లో ముంచెత్తాడు.

ఆమె వారించలేదు... ప్రతిఘటించనూ లేదు. అతనిలోని యువరక్తం యుక్తాయుక్తాలు ఆలోచింపనివ్వలేదు. అలాగే ఇద్దరూ మంచంపై వాలిపోయారు.

ఆ తర్వాత ఆమె ఏక్టివ్ రోల్ తీసుకుంది. అతనికి ఎన్నో విషయాలు నేర్పింది. అతడు ఆమెలో లీనమైపోయాడు. ఆ రాత్రిని అతని జీవితంలో 'మరపురాని రాత్రి'గా మార్చింది నందిని.

గంటసేపు ప్రణయ సమరం సాగించాక అలసటగా కూర్చున్నారు ఇద్దరూ.

"థాంక్యూ నందూ..." తృప్తిగా అన్నాడు చందూ.

"చందూ! ఇక నేను వెళ్తాను. మన సమస్యకు పరిష్కారం మరో మూడురోజుల్లో ఆలోచించి చెబుతాను. అంతవరకూ కాస్త ఓపిక పట్టు. నేను మళ్లీ రేపు ఉదయం వస్తాను. సమరానికి సిద్ధంగా ఉండు..!" అంటూ అతనివైపు చిలిపిగా చూసి, నవ్వి వెళ్లిపోయింది నందిని.

చందూ తన సెల్‌ఫోన్ అందుకుని, అతని బాస్ నెంబరుకి డయల్ చెయ్యసాగాడు.

●

తర్వాతి మూడురోజుల్లో ఆరుసార్లు గదికి వచ్చింది నందిని.

వచ్చిన ప్రతిసారీ అతనికి స్వర్గాన్ని చూపించింది!

ఆరోజు నందినిని 'ఏం ఆలోచించా'వని అడిగాడు చందూ.

"చందూ... మనం ఒక్కటవ్వాలంటే నాకొక్కటే మార్గం కనిపిస్తోంది!"

"ఏమిటది..?"

"నువ్వు మావారిని చంపెయ్యాలి!"

భయంగా ఆమెవైపు చూశాడు చందూ. అంత అందమైన స్త్రీ అటువంటి భయంకరమైన ఆలోచన చేస్తుందని అతను ఊహించలేదు.

"తప్పదు చందూ... ఎలా చంపాలన్నది నువ్వే ఆలోచించు!"

"చంపడమెందుకు? మనం తిరుపతి వెళ్లిపోయి అక్కడే పెళ్ళి చేసుకుని హాయిగా ఉందాం!"

"ఆయన సంగతి నీకు తెలీదు. మనం ప్రపంచంలో ఎక్కడ దాక్కున్నా తెలుసుకోగలడాయన. అంత డబ్బూ ఉంది, మనుషులూ ఉన్నారాయనకు. తనను అవమానం పాలు చేసిన నిన్ను చంపి, నన్ను తీసుకెళ్తారు."

చందూ ఏం మాట్లాడలేదు.

"రేపు ఉదయం మేమిద్దరం సైట్ సీయింగ్ కెళ్తున్నాం. రేపు రాత్రి ఏడు గంటలకు నీ గదికి వస్తాను. బాగా ఆలోచించుకుని నీ నిర్ణయం చెప్పు!"

"ఒక్క నిమిషం..!"

వెళ్తున్న నందిని వెనక్కితిరిగి చూసింది.

"కమల్ వెళ్లిపోయాడా?"

"లేదు..."

"ఎక్కడుంటాడతను?"

"మా ప్రక్కగదిలోనే ఉంటాడు. వాడు మావారికి పర్సనల్ అసిస్టెంట్!"

"మన విషయం అతనికి తెలుసా?"

"తెలుసు. కాని, మావారికి చెప్పడు. వాడు మన పార్టీ!" అని వెళ్లిపోయింది.

●

బోట్‌క్లబ్ దగ్గర ఓ బెంచీపై కూర్చొనివున్నాడు చందూ.

అతని మనసంతా చికాకుగా ఉంది. నందిని విషయంలో ఏం నిర్ణయించుకోవాలో అతనికి అర్థంకావడం లేదు.

"నందినిని వదిలి తను బ్రతకలేడు, నందిని కోసం మురుగవేల్‌ని చంపనూ లేడు. ఏమిటి దీనికి పరిష్కారం..?"

ఒడ్డున ఉన్న బోట్‌ని చూడగానే నందినితో తనకు పరిచయమైన సన్నివేశం గుర్తుకొచ్చింది.

'ఈ పదిరోజుల్లోనే ఎంత పిచ్చిగా ఆమె మాయలో పడిపోయాడు? భర్తనే చంపడానికి నిర్ణయించుకున్న ఆమె సామాన్యురాలు కాదు!' అనుకున్నాడు.

మళ్లీ ఆమె యిచ్చిన సుఖం గుర్తుకొచ్చింది అతనికి. అతని శరీరం ఆమె స్పర్శకోసం తపించసాగింది.

ఇంతలో... కమల్ వస్తూండటం కనిపించింది అతనికి. అతనితో మాట్లాడే ఓపిక లేదనిపించింది. అతన్ని చూడనట్లు తల తిప్పుకుని ఎటో చూడసాగాడు చందూ.

కమల్- చందూ పక్కనే బెంచీపై కూర్చుంటూ... "హలో చందూ..!" అన్నాడు.

"హలో కమల్..." ముఖం మీదికి నవ్వు తెచ్చిపెట్టుకుంటూ అన్నాడు.

"ఏమిటి డల్‌గా కనిపిస్తున్నారు?" కమల్ అడిగాడు.

"ఏం లేదు..."

"నందూ నాకంతా చెప్పింది."

చందూ 'అలాగా...' అన్నట్టు చూశాడు.

"చందూ! నందూ మిమ్మల్ని ఎంతగానో ప్రేమిస్తోంది. మీరు దక్కకుంటే తన ప్రాణాలు తీసుకోవడానికైనా సిద్ధంగా ఉంది."

"తీసుకోవడానికి కాదు... తీయడానికి!" కసిగా అన్నాడు చందూ.

"ఆ విషయం కూడా చెప్పింది. కాని, తన భయమంతా మీ గురించే చందూ! మురుగవేల్ మీకోసం గాలించి, పట్టుకుని మిమ్మల్ని చంపేస్తాడని ఆమె భయపడుతోంది. నిజానికి ఆమె ఆలోచనలో అర్థం లేదు. తనంటే ఇష్టంలేని భార్యకోసం మురుగవేల్ లాంటి కోటీశ్వరుడు అంత శ్రమ తీసుకుంటాడని నేననుకోను. అసలు మీరు తిరుపతిలో ఉన్న విషయం కోయంబత్తూర్‌లో ఉన్న అతనికెలా తెలుస్తుంది?"

"ఆ విషయం నందినికి చెప్పండి. మనిషి ప్రాణాలు తీయడం ఆమె అనుకున్నంత సులువు కాదని కూడా చెప్పండి."

"నేను చెప్పినా వినదు. అందుకే మీకు చెబుదామని వచ్చాను."

"ఏమని? మురుగవేల్‌ని చంపమనా?" వెటకారంగా అన్నాడు చందూ.

"కాదు. చంపినట్లు నటించమని!"

అర్థంకానట్టు చూశాడు చందూ.

"మురుగవేల్ ప్రతిరోజూ సాయంత్రం ఆరుగంటల నుంచి ఏడుగంటల వరకు హోటల్ మేడపైన ఓపెన్ టెర్రస్‌లో మెడిటేషన్ చేస్తాడు. మీరు రేపు ఆరున్నరకు నందూకి ఫోన్ చేసి మురుగవేల్‌ని చంపడానికి వెళుతున్నాననీ, పని పూర్తికాగానే ఆమె గదికి వస్తాననీ, ఆ లోపల ఆమె బట్టలూ అవీ సర్దుకుని సిద్ధంగా వుంటే ఇద్దరూ కలిసి తిరుపతి పారిపోదామని చెప్పండి. ఓ పావుగంట గడిచాక నందూ గదికి వెళ్లి మురగవేల్‌ని చంపేశాననీ, వెంటనే బయలుదేరమనీ చెప్పండి. ఆమె మీరు చెప్పినట్లే చేస్తుంది. హోటల్ బయట నా ఫ్రెండు మోటర్‌బైక్ సిద్ధంగా ఉంచుతాను. మీరు కోయంబత్తూర్ వెళ్లి, అక్కడ నేను చెప్పిన అడ్రసులో నా ఫ్రెండుని కలిసి, బైక్ అప్పజెప్పి మీరు బస్సు, ట్రైన్ ఏది దొరికితే అది పట్టుకుని తిరుపతి వెళ్లిపోండి. అలా చేయడం వల్ల మురుగవేల్ మరణించాడన్న నిశ్చింత నందూకి ఉంటుంది.., అతన్ని చంపలేదన్న నిశ్చింత మీకూ ఉంటుంది... ఏమంటారు?"

చందూ అతనివైపు మెచ్చుకోలుగా చూస్తూ, "ఈ ఐడియా బాగానేవున్నట్లు నాకు అనిపిస్తోంది" అన్నాడు.

"అయితే ఇంకేం? రేపు ఆ పని పూర్తిచెయ్యండి. ఈరాత్రే మీరుంటున్న గది ఖాళీచేసి మా హోటల్‌లోనే ఓ గది తీసుకోండి. మన ప్లానుకు అనువుగా ఉంటుంది. అయితే ఒకే ఫ్లోర్‌లో మాత్రం వద్దు. ఎందుకంటే మీరు గదినుండి కదల్లేదన్న విషయం నందూకి తెలిసిపోతుంది."

"అలాగే! ఈలోగా నేను మురుగవేల్‌ని ఒకసారి చూడాలి."

"నేను చూపిస్తాను..." అన్నాడు కమల్.

●

దగ్గరగా వేసివున్న తలుపు తెరుచుకుని, లోపలికి అడుగుపెట్టాడు చందూ.

నందిని రెండుచేతులూ తలపై పెట్టుకుని, తలను మోకాళ్లకు ఆనించి సోఫాపై కూర్చొనివుంది.

"నందూ..."

ఆమె తలెత్తి చూసింది.

"నేను మురుగవేల్‌ని చంపేశాను!"

ఆమె నమ్మలేనట్లు చూసింది.

"నిజం నందూ... మేడ పైనుంచి తోసేశాను... తల పగిలి చనిపోయాడు."

ఆమె భయంతో వణకసాగింది.

"ఏమైంది నందూ... ఎందుకలా భయపడుతున్నావు?"

ఆమె ప్రక్కనే ఉన్న గదివైపు చేయి చూపించింది.

అక్కడి దృశ్యం చూసి షాక్ తిన్నట్టు నిలబడిపోయాడు చందూ.

ఆ గదిలో పోలీసు అధికారులతో కమల్ కూర్చొనివున్నాడు. గదినిండా పోలీసులు ఉన్నారు. వెంటనే చందూని చుట్టుముట్టారు అందరూ.

"కమాన్... అరెస్ట్ హిమ్!"

ఓ అధికారి ఆజ్ఞ విని చందూ చేతులకు బేడీలు వేయసాగారు పోలీసులు.

"నేను మురుగవేల్‌ని నిజంగా చంపలేదు..." తమిళంలో అన్నాడు చందూ.

"కానీ, మురుగవేల్ నిజంగానే మేడమీది నుంచి త్రోయబడి చనిపోయాడు. మాకు ఎక్కువ కష్టం కలిగించకుండా నేరం నువ్వే ఒప్పుకున్నావు!" అన్నాడు ఆ పోలీసు అధికారి. తర్వాత అతను కమల్‌కి చెయ్యి అందిస్తూ... "థాంక్యూ కమల్... హంతకుడిని మాకు పట్టిచ్చారు" అని, చందూ వైపు చూసి "కమాన్..." అంటూ ముందుకు కదిలాడు.

జీప్ ఎక్కుతున్న చందూ హోటల్ ఆవరణలో ఓ చోట జనం గుమికూడి ఉండటం చూశాడు.

పోలీసులు జనాన్ని అదిలిస్తూంటే జనం మధ్య నుంచి అతనికి కనబడింది ఆ దృశ్యం. మురుగవేల్ తల పగిలి పడివున్నాడు.

తలెత్తి చూశాడు...

నందిని, కమల్ బాల్కనీలో నిలబడివున్నారు...

వాళ్ళిద్దరి ముఖాల్లో నవ్వు కనిపించిందతనికి.